www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 5 అక్టోబర్ 2025

5

అన్నమయ్య

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

మాట్లాడుతున్న ప్రొఫెసర్ సాయి కుమార్

ప్రజాశక్తి-మదనపల్లె : స్థానిక అదిత్య ఇంజినీరింగ్ కళాశాల కెరీయర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ఉత్తమ భవితవ్యానికి మనవైఖరి, ప్రవర్తన అనే అంశంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.ఎల్.సాయి కుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మంచి వైఖరి, వ్యక్తిత్వ వికాసం, జీవన దృక్పథంపై ప్రేరణాత్మకంగా వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయుడు విద్యార్థులు ఉన్నతికి సరైన ప్రవర్తన, దృక్పథం ఎంత ముఖ్యమో వివరించారు. హ్యూమానిటీస్, సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ టి.అమరనాథ్‌రెడ్డి విద్యార్థుల లోతైన అభివృద్ధికి విలువాధారిత కార్యక్రమాలు అవసరమని సూచించారు. కెరీయర్ గైడెన్స్ సెల్ కో-ఆర్డినేటర్ కె.ఈశ్వరరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

జిఎస్‌టి తగ్గింపు.. కనిపించని మినహాయింపు

- లభించని ఉపశమనం
- వినియోగదారుల ఆశలు ఆవిరి..
- పేద, మధ్య తరగతి ప్రజల్లో ప్రతిబింబించని జిఎస్‌టి
- ఓల్డ్ స్టాక్ పేరుతో పాత రేట్లకే విక్రయాలు
- అధికారుల పర్యవేక్షణ లోపం



ప్రజాశక్తి-పులివెందుల టౌన్

తాజాగా జిఎస్‌టి విధానాల్లోని అవకతవకలను సరిచేస్తూ కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి-2ను ప్రకటించింది. ఈ విధానం ప్రకారం పలు వస్తువులకు ఇప్పటి వరకు అధికంగా విధించబడ్డ పన్నుల శాతాన్నిన తగ్గించారు. దీంతో పలు ముఖ్యమైన, నిత్యం వాడుకునే వస్తువులు పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. ఈ విధానం సెప్టెంబరు 22 నుంచే అమల్లోకి వచ్చింది. దీని ప్రకారం దుకాణాల వారు జిఎస్‌టి తగ్గింపును అమల్లోకి తీసుకు రాలేదు. ముఖ్యంగా నిత్యావసర సరుకుల విషయంలో ఈ తగ్గింపు ప్రజలకు చేరడం లేదు. ఆయా దుకాణాలు, మార్టులు జిఎస్‌టి తగ్గింపును అమల్లోకి తీసుకురాకుండా యథావిధిగా పాత రేట్లకే అమ్మతున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం తగ్గించినప్పటికీ ఆయా ఫలాలు ప్రజలకు అందడం లేదు. ఈ విషయమై ఎవరికి ఫిర్యాదు చేయాలో ప్రజలకు కూడా అర్థం కావడం లేదు. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో కొన్ని దుకాణాలు ఆడింది ఆటగా పాడింది పాటగా జరిగిపోతోంది. జిల్లా వ్యాప్తంగా జిఎస్‌టి తగ్గింపు ప్రభావం ఇప్పటి వరకు ప్రజలకు కనిపించడం లేనట్లు తెలుస్తోంది. ప్రభుత్వం కొత్త రేట్లు అమలు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ మార్కెట్‌లో మాత్రం వ్యాపారులు ఓల్డ్ స్టాక్ పేరుతో పాత రేట్లకే సరుకులు విక్రయిస్తున్నారు. ఈ కారణంగా వినియోగదారులు ఆశించిన ఉపవమనం అందక, తీవ్ర నిరాశాలో మగ్గుతున్నారు. వినియోగదారుల మాటాల్లో చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వం తగ్గించింది కాబట్టి తాము తక్కువ ధరలకు సరుకులు కొనుక్కోవాలని ఆశించారు కానీ, ఇప్పటికీ పాత రేట్లకే బిల్లులు వేస్తున్నారు. కొత్త రేట్లను అమలు చేయకపోవడం పట్ల ప్రభుత్వంపై ప్రజల నమ్మకం తగ్గిపోతున్నట్లు తెలుస్తోంది..

మరోలా వ్యాపారుల వాదన

వ్యాపారుల వాదన వేరేలా వినిపిస్తుంది. తాము పాత రేట్లకే సరుకులు తెచ్చుకున్నట్లు వాటిని కొత్త రేట్లకు అమ్మితే నష్టం వస్తుందని వాపోతున్నారు. అయితే వినియోగదారులు దీన్ని అంగీకరించడం లేదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజల కోసం, దాని ప్రకారమే విక్రయించాలని, జిఎస్‌టి తగ్గింపు ్ప ప్రయోజనం రాకపోతే ఎలా అంటూ ప్రశ్నిస్తున్నారు. వ్యాపారులు ముందుగా కొనుగోలు చేసిన వస్తువులను పాత రేట్లలో విక్రయించడం వల్ల కొత్త జిఎస్‌టి రాయితీ వినియోగదారులకు చేరడం లేదు. వాటికి సైతం జిఎస్‌టి అన్వయిస్తేనే తాము వస్తువులను జిఎస్‌టి ప్రకారం విక్రయిస్తామని చెబుతున్నారు.

పర్యవేక్షణ లోపం

సంబంధిత అధికారులు మార్కెట్లలో ఆకస్మాత్తుగా తనిఖీలు చేసి, కొత్త రేట్ల అమలు జరుగుతోందా లేదా అని చూడాలి. కానీ ఇలా జరగడం లేదు. జిఎస్‌టి అమలు చేసినప్పటి నుండి సంబంధింత అధికారులు పర్యలేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. కాబట్టి వెంటనే పర్యవేక్షించాల్సి బాధ్యత అధికారులపై ఉంది. మార్గదర్శకత లేకపోవడం, పాత స్టాక్ కొత్త రేట్లతో ఎలా అన్వయించుకోవాలి అనే స్పష్టత లేకపోవడం కూడా సమస్యను మరింత జఠిలం చేస్తోంది. దీనిపై ప్రజల ఆగ్రహం బయటపడుతోంది. ప్రభుత్వం తగ్గించింది అని వార్తల్లో మాత్రమే చూస్తున్నాం కానీ దుకాణాల్లోకి వెళ్లినప్పుడు మాత్రం అదే పాత రేట్లకు విక్రయిస్తున్నారు. మరి ఇది మోసం కాదా ఏమిటీ అని వినియోగదారులు మండి పడుతున్నారు. వారు స్పష్టంగా కొత్త రేట్లు అమలు చేయకపోతే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కిరాణాపై ఎలా ఉండేది?

కేంద్ర ప్రభుత్వం చెప్పేదాని ప్రకారం కిరాణా సామగ్రిపై గతంలో 18-12-5 శాతం ఇలా మూడు స్లాబ్‌లో జిఎస్‌టి పన్ను విధించగా తాజాగా దీన్ని కొన్ని వస్తువులపై పూర్తిగా తొలగించడంతో పాటు మరికొన్ని వస్తువులపై 5 శాతం వరకూ తగ్గించినట్లు చెబుతున్నారు. రోజువారీ నిత్యావసరాలపై గతంలో 12 శాతం, 18శాతం పన్నులు ఉండేవి. తాజాగా 5 శాతానికి తగ్గించినట్లు కేంద్రం చెబుతోంది. విశాఖ నగరంలో పాదరక్షలపై 12 శాతం జిఎస్‌టియే కొనసాగుతోంది. పలు షాపుల్లోకి వెళ్లే జనానికి దసరాతో చేదు అనుభవం ఎదురైంది. 12 శాతాన్ని కొత్త జిఎస్‌టి ప్రకారం 5 శాతం చేయాల్సి ఉంది. కానీ అమలు కావడం లేదు. పాత జిఎస్టి పద్ధతినే వ్యాపారులు అనుసరిస్తుండడం అనేక నిత్యావసర సరకుల విషయంలో కొనసాగుతోంది. ఒక షాపు యజమానిని ప్రశ్నించిన కస్టమర్లతో మాట్లాడుతూ 'ఇంకా సాఫ్ట్‌వేర్ అప్డేట్ కాలేదని, కొత్త స్టాక్‌తో కొత్త బిల్లులు వస్తే అప్పుడు అమలు చేస్తామంటూ ప్రస్తుతానికి పాత జిఎస్‌టితోనే సరకులు కొనాలంటూ చెబుతున్నారు. పాత ఎంఆర్‌పికే అమ్ముతామని తెగేసి చెబుతున్నారు.

జిఎస్‌టి 2.0తో ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రచారాలు

2014లో ఎన్‌డిఎ ప్రభుత్వం ఆధికారంలో ఉన్నప్పటికీ అంతర్జాతీయ క్రూడాయిల్ ధరల ప్రకారం ఏ రోజు కూడా పెట్రోల్ ధరలు తగ్గించబడలేదు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరిగినప్పుడు మాత్రం పెట్రోల్ ధరలు పెంచి దర్జాగా పెట్రోలియం కంపెనీలు దండుకున్నాయి. వాస్తవంగా అంతర్జాతీయంగా ఉన్న క్రూడాయిల్ ధరలను అనుసరించి పెట్రోల్ ఒక లీటర్ దాదాపు రూ.75 లకే ప్రజలకు అందుబాటులో ఉండాల్సి ఉన్నప్పటికి రూ.110లు ఉందంటే ఎంత దోపిడీ జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు.. ఇవన్నీ సరిచేయకుండా ఎన్‌డిఎ ప్రభుత్వం జిఎస్‌టి 2.0 పేరుతో తగ్గింపులు చేశామని సంబరాలు చేసుకుంటూ ప్రచారాలకు దిగడం ప్రజలను నివ్వెరపరుస్తోంది. జిఎస్‌టి 2.0 అమల్లోకి వచ్చిన తరువాత ధరలు తగ్గినా ఇంకా పాత ధరలకే కొంత మంది అమ్ముతున్నట్లు సమాచారం.

పేరుకే జిఎస్‌టి తగ్గింపు

పేరుకే జిఎస్‌టి తగ్గించినారే తప్ప ఆచరణలో మాత్రం లేదు. నిత్యావసర వస్తువులు తగ్గిన జిఎస్‌టి స్లాబ్ ప్రకారం అమ్మడం లేదు. పాత రేట్ల ప్రకారమే విక్రయిస్తున్నారు. **- అమరావతి, గృహిణి, పులివెందుల**

అధికారులు చొరవ చూపాలి

అధికారులు చొరవ తీసుకొని తగ్గిన రేట్ల ప్రకారం వ్యాపారులు అమ్మేలా చూడాలి. అప్పుడే సామాన్య ప్రజలకి జిఎస్టి వల్ల ఉపయోగం ఉంటుంది.

- రామాంజనేయులు, చిరు ఉద్యోగి, పులివెందుల

పాత స్టాక్‌కు జిఎస్‌టి తగ్గిస్తే నష్టం

పాత స్టాక్‌కు జిఎస్టఇ తగ్గించి విక్రయిస్తే నష్టాలు వస్తాయి. కాబట్టి పాత ధర ప్రకారమే విక్రయిస్తున్నాం. కొత్త వస్తువులకు మాత్రమే జిఎస్‌టి తగ్గింపు ఉంది.

- రఘునాథ గుప్తా, జనరల్ స్టోర్, పులివెందుల

వానొస్తే.. బస్టాండ్ మునకే..

- ఆర్‌టిసి బస్టాండ్‌ను ముంచెత్తిన వరద
- దుకాణాల్లోకి చొరబడిన నీరు
- నీటిలోనే ప్రయాణికుల నడక

బస్టాండ్ ప్లాట్‌ఫారంపైకి చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరులో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆర్‌టిసి బస్టాండ్‌లోకి భారీగా వరద నీరు చేరింది. బస్టాండ్ ఆవరణలో మోకాటి లోతు వరకు వర్షం నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్లాట్‌ఫారాల్లోకి సైతం వాన నీరు చేరింది. ప్రయాణికులు కుర్చీల్లో కూర్చోలేకపోయారు. వర్షం కురిస్తే చాలు, నీరు వాగుల్లా పొర్లుకుంటూ వస్తాయి. మురుగునీటి కాలువలు చెత్తాచెదారంతో నిండుకొని నీరు రోడ్లపై పరుగులు పెడుతుంది. వాహనాల రాకపోకలతో పాటు పాదచారులు కూడా ఇబ్బందికి లోనౌతారు. వర్షం కురిసిన ప్రతిసారీ పీలేరు ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు ఎదుర్కొంటూన్న సమస్య ఇది. శనివారం తెల్లవారుజాము నుంచి కురిసిన కొండపోత వర్షానికి పీలేరు పట్టణంలోని ఆర్‌టిసి బస్టాండు, పరిసరాలు జలమయమయ్యాయి. వాన కురిసిన ప్రతిసారీ పీలేరు ఆర్‌టిసి బస్టాండులో బస్సులు, ప్రయాణికులు, రోడ్డుపై వాహనాలకూ ఇబ్బందులు తప్పడం లేదు. మురుగునీరు కూడా రోడ్లపై పరుగులుతీస్తుండడంతో వాహనాల రాకపోకలకు, పాదచారులకు మరింత ఇబ్బందిగా మారింది. స్థానిక ఆర్టీసీ బస్టాండు, ప్లాట్ ఫామ్‌పైకి వర్షపు నీరు చొరబడ్డంతో అక్కడి దుకాణాలన్నీ నీటితో నిండాయి. ఆర్‌టిసి బస్సులు, ప్రయాణికులకు నీటిలో నడవక తప్పనిసరైంది. స్పందించిన స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ఎండి రోషన్ అగ్నిమాపక బృందాన్ని రప్పించి బస్టాండులోకి చేరిన వర్షపు నీటిని తోడించే కార్యక్రమాన్ని చేపట్టారు.

బస్టాండ్‌లో చేరిన వర్షపు నీటిని తోడుతున్న ఫైర్ ఇంజన్

ఆర్‌టిసి అధికారులకు మా గోడు పట్టడం లేదు

ఆర్‌టిసి అధికారులకు తమ గోడు పట్టడం లేదని బస్టాండులోని దుకాణదారులు వాపోతున్నారు. నెలనెలా తాము అద్దెలు కడుతున్నా తమకు తగిన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వర్షం కురిసిన ప్రతిసారీ వ్యాపారులందరూ వారి వారి దుకాణాల్లోకి చేరిన వర్షపు నీరు, బురదను ఊడ్చుకోక తప్పిందికాదని అంటున్నారు. వానొచ్చిన ప్రతిసారీ తాము పడే బాధలను, కోల్పోతున్న ఆదాయాన్ని ఆర్‌టిసి అధికారులు గుర్తించడం లేదని వ్యాపారులు చింతిస్తున్నారు. శనివారం కురిసిన వర్షానికి తమ దుకాణాల్లోని వస్తువులు తడిసిపోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని చెప్పారు.

ప్రత్యేక ఎస్‌సి, ఎస్‌టి గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలి

కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి -రాయచోటి అర్బన్: జిల్లాలో నెలకు ఒక రోజు ప్రత్యేక ఎస్‌సి, ఎస్‌టి గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలగుంట శ్రీనివాసులు, బి.మనోహర్, ఎస్.రామకృష్ణ, జి.వెంకటరమణ కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి ప్రజల ఎదుర్కొంటున్న సమస్యల నిమిత్తం నెలలో ఒకరోజు ప్రత్యేకంగా ఎస్‌సి, ఎస్‌టి గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల్లో బాధితులకు కాంపొజేషన్ సకాలంలో అందడం లేదన్నారు. జిల్లాలో పలు మండలాల్లో ఎస్‌సి, ఎస్‌టి మాని టరింగ్ కమిటీ సమావేశాలు, పౌరహక్కుల దినోత్సవం నిర్వహిం చడం లేదని తెలిపారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి ఈనెల 8న నిర్వహించే జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సమావేశంలో సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సమన్వయంతోనే సమస్యలకు పరిష్కారం

- మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి

మాట్లాడుతున్న రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి అర్బన్

ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో పని చేయడం ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి రూరల్ మండలం సర్వ సభ్య సమావేశం ఎంపిడిఒ సభాభవనంలో ఎంపిపి పల్లపు రాజమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. తాగునీటి ఎద్దడి అధికంగా ఉన్న గ్రామాల్లో పల్లెలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ప్రదీప్ మాట్లాడుతూ మండలంలోని మాధవరం, గొర్లముదివేడు, వరిగ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొన్న 24 పల్లెలకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ప్రజా ప్రతినిధులు ఇంకా ఎక్కడెక్కడ తాగునీటి ఎద్దడి ఉందనే విషయం తెలిపితే ఆ ప్రాంతాలకు కూడా తాగునీరు సరఫరా చేస్తామని చెప్పారు. ఎంపిడిఒ పరిపూర్ణ అరుంధతి మాట్లాడుతూ గ్రామాలకు వివిధ శాఖల ద్వారా మంజూరైన ప్రభుత్వ భవనాలను ఊరికి దూరంగా నిర్మిస్తున్నందున అవి నిరుపయోగం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీర్లు గుర్తించి అందరికీ అనుకూలమైన ప్రాంతంలో భవనాలను నిర్మించేందుకు కృషి చేయాలన్నారు. సెరి కల్చర్ అధికారి సింధుజా మాట్లాడుతూ పట్టుపరిశ్రమను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రకాలుగా కృషి చేస్తుందన్నారు. పట్టుపురుగుల పెంపకానికి అవసరమైన షెడ్డులను నిర్మించడంతోపాటు మొక్కల పెంపకానికి కూడా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు చెప్పారు. వ్యవ సాయ ఆధారిత ఉత్పత్తులు, యంత్రాలు, పరిక రాల కొనుగోలుపై ప్రభుత్వం 18 శాతం నుండి ఐదు శాతానికి జిఎస్‌టి తగ్గించడం రైతులకు ఎంతో లాభదాయకం అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో వర్షభా వంతో పంటలు సాగు చేయలేకపోయినా రైతాంగానికి రబీ సీజన్‌లో పంటలు సాగుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీ కింద అందజేస్తామని చెప్పారు. ఉపాధి ఎపిఒ రవి మాట్లాడుతూ గ్రామాల్లో పశువులకు తాగునీటి సౌకర్యం కోసం 20 తోట్లను నిర్మించామన్నారు. రైతులు తమ పొలాల్లో పండ్ల మొక్కలను పెంచు కునేలా ప్రోత్సహిస్తున్నామన్నారు. గడ్డి పెంపకానికి కూడా తోడ్పాటు ఇస్తున్నా మన్నారు. తమ పొలాలు, తోటల చుట్టూ రైతాంగం కందకాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. ఎంఇఒ నాయక్ మాట్లాడుతూ డిసెంబర్ నెలలో టెన్త్ సిలబస్ బోధనను పూర్తి చేసి తర్వాత రివ్యూ చేస్తా మన్నారు. పాటు ప్రజా ప్రతినిధులు కూడా పాఠశాలలను సందర్శించి విద్యాభివృద్ధికి తగుమేర తోడ్పా టును ఇవ్వాలంటూ సూచించారు. ఉద్యాన వన శాఖ అధికారి మాట్లాడుతూ పొలాల్లో ప్యాక్ హౌస్ ల నిర్మాణానికి రూ. 4 లక్షల ను రెండు లక్షల సబ్సిడీతో అంద జేస్తామన్నారు. సబ్సిడీ కింద నీటిగుంతలు ఏర్పాటు, పంటల సాగుకు పట్టలు అందిస్తున్నట్లు చెప్పారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు అందిస్తున్నట్టు వివరించారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు సైకం జైపాల్ రెడ్డి, పార్వతమ్మ, ఎంపిటిసిలు సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు

వీరభద్రుడి హుండీ ఆదాయం రూ.22.99 లక్షలు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో శనివారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. జిల్లా దేవాలయ శాఖ అధికారి సి. విశ్వనాథ్ పర్యవేక్షణలో జులై1 నుంచి ఈనెల 4 వరకు 100 రోజులకు గాను హుండీలు లెక్కించగా శ్రీ వీరభద్రస్వామి హుండీ ఆదాయం రూ.16, 83, 610 వచ్చింది. శ్రీ భద్రకాళీ అమ్మవారి హుండీ ఆదాయం రూ.2, 88, 310, శ్రీ విగ్నేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.83, 160 లు, శ్రీ అఘోరాలింగేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం రూ.69, 750 ఆదాయం వచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు. అలాగే శ్రీ సుబ్రమణ్య స్వామి, కాలభైరవ స్వామి, శ్రీ నవగ్రహ మండపం హుండీ ఆదాయం రూ.48, 470 లతో కలిపి మొత్తం రూ.21,73,300 లను పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో జమ చేశారు. అన్నదానం హుండీ ఆదాయం రూ.1,26,130 రాగా ఆ మొత్తాన్ని స్టేట్ బ్యాంకు అన్నదానం ఖాతాలో జమ చేసినట్లు ఆలయ ఇఒ. డి.వి రమణారెడ్డి తెలియజేశారు. ఆలయంలోని మొత్తం హుండీల ఆదాయం రూ.22, 99, 430 లతో పాటు 17 గ్రాముల 100 మిల్లి గ్రాముల బంగారం నగలు, 2 కేజీల 200 గ్రాముల వెండి వస్తువులు కానుకగా వచ్చినట్లు తెలిపారు. జిల్లా దేవదాయశాఖ అధికారి విశ్వనాథ్ పర్యవేక్షణలో నిర్వహించిన ఈ హుండీల లెక్కింపులో ఆలయ ఇఒతో పాటు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

నగదు లెక్కిస్తున్న పూజారులు, ఆలయ సిబ్బంది

రవాణా వ్యవస్థలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకం

- కలెక్టర్ నిశాంత్ కుమార్

మదనపల్లె : ఆటో డ్రైవర్‌కు చెక్కును అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గ్రామాలు, పట్టణాల ప్రజా రవాణా వ్యవస్థలో ఆటో డ్రైవర్ల పాత్ర కీలకమని, విద్యార్థి దశలో ఆటో డ్రైవర్లతో ఏర్పడిన భావోద్వేగ బంధాన్ని మరిచి పోలేనని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు రూ.15 వేల ఆర్థిక సాయం అం దించడంలో భాగస్వామి కావడం చాలా ఆనందంగా ఉందన్నారు. పశ్చిమ దేశాలలో బస్సులు, మెట్రో ట్రైన్ లాంటి ప్రజా రవాణా వ్యవస్థ ఎక్కువగా ఉప యోగంలో ఉంటుందని, భారత దేశంలో జనాభా ఎక్కువగా ఉండటం వలన ప్రజా రవాణా సరిపోదన్నారు. అందువల్లే ఆటోలు క్యాబ్‌ల అవసరం చాలా ఎక్కు వగా ఉంటాయన్నారు. పట్టణాలలో సేవలందించడమే కాకుండా గ్రామాలను పట్టణాలను కలిపే కీలకమైన పాత్రను ఆటో డ్రైవర్లు పోషిస్తున్నారని పేర్కొ న్నారు. తాను సివిల్ సర్వీసెస్ పరీక్షకు ప్రిపేర్ అయ్యేటప్పుడు, ఇంటర్వ్యూకి వెళ్లేటప్పుడు ఆటో డ్రైవర్ల ద్వారా తీసుకున్న సహాయాన్ని ఎప్పటికీ మర్చిపోలే నన్నారు. విద్యార్థిగా ఉన్న సమయంలో ఎంతోమంది ఆటో డ్రైవర్లతో భావోద్వే గమైన సంబంధాలు తనకు ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకి వెళ్లే సమ యంలో ఆటోలో వెళుతుండగా తన ఆందోళనను ఆటో డ్రైవర్ గుర్తించి ఇంట ర్వ్యూ బాగా జరుగుతుంది సార్ అని చెప్పి మానసికంగా ధైర్యాన్ని ఇచ్చిన ఆటో డ్రైవర్ను మరచిపోలేనన్నారు. ఆటో డ్రైవర్లకు ఈ రోజు అందించే రూ.15 వేలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబాల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచిం చారు. సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జిఎస్‌టి 2.0 ద్వారా ఆటో డ్రైవర్లకు ఆటో మెయిం టెనెన్స్ ఖర్చు తగ్గిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 8,835 లబ్ధిదారులకు రూ.13.25 కోట్ల నగదు జమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం మాత్రమే ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తుం దన్నారు. గతంలో పేదలందరికీ ఇళ్ల పథకంలో కేవలం కేంద్ర ప్రభుత్వం అందించే సహాయాన్ని మాత్రమే ప్రజలకు ఇచ్చే వారిని ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభు త్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నాయన్నారు. ఈరోజు అమలు చేస్తున్న ఆటో డ్రైవర్ల సేవలో పథకం సూపర్‌సిక్స్ మేనిఫెస్టోలో లేదని అయినప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేశారని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఏ చిన్న సమస్య లేకుండా మెగా డిఎస్‌సిని పూర్తి చేశారన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు రూ.15 వేల నగదును అందివ్వడం కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వారి ఆత్మగౌరవాన్ని పెంచడమన్నారు. లబ్ధిదారులకు సమస్య ఉంటే వారి సమస్యను రవాణా శాఖ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది నియోజకవర్గ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

రాజంపేట : ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని సబ్ కలెక్టర్ హెచ్.ఎస్.భావన పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమ ర్యాలీని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు, డిసిసి చైర్మన్ సూర్య నారాయణరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వరప్ర సాద్, ఎంవిఐ వినోద్ కుమార్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దేపల్లి ప్రతాప్‌రాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, గీతాంజలి రమణ, డాక్టర్ నవీన్ చంద్ర, పెద్ద ఎత్తున ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. **పీలేరు:** ఆటో డ్రైవర్ల బ్యాంక్ ఖాతాల్లోకి రూ.15 వేలు వంతున జమ చేసినట్లు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా వారి ఖాతాలకు నగదు జమ చేసే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంవిఐ విజయకుమారి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రాజేశ్వరి, పీలేరు ఎఎంసి చైర్మన్ పురంరామమూర్తి, నాయకులు కోటపల్లి బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు. **రైల్వేకోడూరు:** ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం వరం లాంటిదని టిడిపి నాయకులు ముక్కా సాయి వికాస్‌రెడ్డి అన్నారు. తహశీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకాన్ని ఆవిష్కరించేందుకు సమా వేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ అమర్నాథ్, ఎంపిడిఒ నాగిరెడ్డి పాల్గొన్నారు. **రాయచోటి:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ సేవల అనే పథకం ఒక వరం లాంటిదని టిడిపి నియో జకవర్గ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. మొత్తం రూ.436 కోట్లు ఖర్చు చేసి అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుందని హామీ ఇచ్చారు. అర్హత లేని వారు నిరాశ చెందవద్దని సూచిస్తూ ప్రజలతో ఎల్లప్పుడూ చంద్రన్న ప్రభుత్వం ఉంటుందన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 1875 మంది లబ్ధిదారులు ఎంపిక అయ్యారని, ఇంకా అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ రవి, టిడిపి నాయకులు, కూటమి నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



రాజంపేట : ఆటో డ్రైవర్‌కు చెక్కును అందిస్తున్న సబ్ కలెక్టర్ భావన, చమర్తి

విద్యుత్ స్తంభాలతో పొంచి ఉన్న ప్రమాదం

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-చిట్వేలి

మండల పరిధిలోని ఇటీవల గృహ అవసరాలకు 24 గంటల విద్యుత్ కొరకు రోడ్డు పక్కన ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ స్తంభాలకు పక్కన అనుసంధానంగా ఉంచిన స్తంభా లకు ఎలాంటి క్లాంపులు బిగించలేదు. వర్షాలకు భూమి కాస్త కృంగిపోవడంతో దేఎ ామాచుపల్లి పంచాయతీ కంద్రా వారిపల్లి సమీపంలో మలుపు వద్ద విద్యుత్ స్తంభం రోడ్డు అంచునకు ఒరిగింది. ఇలాంటి విద్యుత్ స్తంభాలు సుమారు అన్ని రోడ్లకు ఇరువైపులా ఉన్నాయని, ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ సమ స్యపై స్థానిక విద్యుత్ శాఖ అధికారి చలపతిని వివరణ అడుగగా అవి మనకు సంబంధం లేదని సంబంధిత వారికి సమాచారం ఇచ్చి వెంటనే సమస్య పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని అన్నారు .ఏది ఏమైనప్పటికీ ప్రమాదం జరగకముందే అధికారులు మేలుకొని పరిష్కారం చెయ్యాలని వాహనదారులు కోరుకుంటున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-కలికిరి

ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలతో పూర్తిగా నష్టం జరిగిన రైతులను కూటమి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని పీలేరు నియోజకవర్గ సమాచార హక్కు చట్టం అధ్యక్షుడు మద్దిరాల మల్లికార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టమోటా, వరి, వేరుశనగ, మిరప, బొప్పాయి పంటలను సాగుచేసి ఎంత పడితే అంత అప్పులు తీసుకొచ్చి, పెట్టుబడులు పెట్టి చేతుకొచ్చిన పంటలు భారీ వర్షాలతో పూర్తిగా నష్టాలు తీసుకొచ్చి రైతన్నల మీద భారం పడటంతో దిక్కుతోచని స్థితిలో రైతన్నలు ఉన్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతన్నలను ఆదుకోవాలని,అధికారులు కూడా రాజకీయంతో సంబంధం లేకుండా నష్టపోయిన ప్రతి రైతన్నలకు పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మదనపల్లె జిల్లా సాధన కోసం తొలివిడతలో 633 రోజుల పాటు జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా భాగస్వాములైన మీకు ప్రత్యేక అభినం దనలు తెలిజేస్తూ రాజకీయ పార్టీల నేతలకు, ప్రయివేట్ విద్యా సంస్థల అధినేతలకు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు,కుల సంఘాల నాయకులకు, జర్నలిస్టులకు, కార్మిక సంఘాల నాయకులకు, విద్యార్థి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు,వ్యాపార సంఘాల నాయకులకు,మైనార్టీ సంఘాల నాయకులకు, మేధావులకు,మహిళలకు రెండో దశ ఉద్యమంలోకి సాధరంగా ఆహ్వానిస్తున్నామని మదనపల్లె జిల్లా సాధన సమితి పేర్కొంది. మదనపల్లి జిల్లా ప్రకటన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలనే సదుద్దేశంతో,మదనపల్లి జిల్లా పరిధిలోకి వచ్చే నాలుగు నియోజకవర్గాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించాలని తీర్మానించడం జరిగిందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గపు సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు బి.కొత్తకోట పట్టణంలోని బెంగళూరు రోడ్డులో గల షాదీమహల్‌లో జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి తప్పక హాజరై తగు సూచనలు,సలహాలు ఇచ్చి భవిష్యత్ కార్యాచరణలో భాగస్వాములు కావాలన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ముద్దనూరు : గ్రామాల అభివృద్ధి, ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతి నిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపిడిఒ రాధాకృష్ణవేణి సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ఎం పిడిఒ ఆధ్వర్యంలో ఉప మండలాధ్యక్షులు అధ్యక్షతన మండల సర్వసభ్య సమా వేశం నిర్వ హించారు. ఆయా శాఖల అధికారులు వారు చేపడుతున్న పనుల గురించి సమా వేశంలో వివరించారు. సర్పంచులు, ఎంపి టిసిలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన క్రిస్టియన్ కాలనీ ఏర్పాటుకు వినతి

వేముల : వేముల క్రిస్టియన్ కాలనీ వాసులకు నూతన కాలనీ ఏర్పాటు చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు వినతిపత్రం అందజేశారు. శనివారం పులివెందుల ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో మంత్రి సవితను బీటెక్ రవి, వేల్పుల సొసైటీ కమిటీ మెంబర్ తొలి సాకు రాము, రాంపతాడు నాగేంద్ర బాబు కాలనీ వాసులు మంత్రిని కలిశారు. ప్రస్తుతం ఉన్న కాలనీ చాలా ఇరుకుగా ఉందన్నారు. మోటర్ బైక్ వెళ్లే దారి మాత్రమే ఉందన్నారు. కొత్త గృహాలకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అర్హత ఉన్న వారందరికీ పక్కాగృహాలు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. మంత్రి సవిత మాట్లాడుతూ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన కాలనీ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు) : ఆటోడ్రైవర్ల వాహనమిత్రులకు అర్హత ఉండి అర్హుల జాబితాలో పేరు రాకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఆదిశేషారెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎస్‌సిసిఆర్ కల్యాణమండపంలో ఆటో డ్రైవర్ల సేవలో ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైదుకూరు నాలుగు రోడ్ల కూడలి నుండి ఆటోలతో అధికారులు, నాయకులు ర్యాలీ నిర్వహించారు. రూ.17.18 కోట్ల మెగా చెక్కును ఆటో డ్రైవర్లకు అంద జేశారు. మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఎంపిడిఓలు శ్రీధర్ నాయుడు, దివిజా సంపతి, కనీస వేతనాల కమిటీ డైరెక్టర్ దాసరి బాబు, నీటి పారుదల సంస్థ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఏపీ రవీంద్ర, సొసైటీ చైర్మన్ పాశం మారుతి, నాయకులు ధనపాల జగన్, వెంకట రమణారెడ్డి, పుట్టా ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ :

అసాంఘిక కార్యకలాలు మట్కా, జూదం, అక్రమ మద్యం, మత్తు పదార్థాలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉం చామని ఎస్‌పి నచికేతన్ విశ్వనాథ్ తెలి పారు. పులి వెందుల డిఎస్‌పి కార్యాల యంలో శనివారం పులివెందుల సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, శాంతిభద్రతల గురించి అడిగి తెలుసుకున్నారు. అనం తరం సబ్ డివిజన్ కార్యాలయంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేద న్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్, సబ్ డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE OF MADANAPALLE

O.E.P.No. 34 OF 2021

O.S.No. 121 OF 2003

M/s. Model Chits Corporation Ltd., Tirupati having it's registered office at 2nd Floor, Model, Housing Panjagutta, Hyderbad -82, A.P. Having among to her branches a branch at 505, Mosque Street, Tirupati, represented by it's Manager/ Foreman G. Sankaraiah, S/o. G. Sankariah, ...Dhr

Vs

T Venkatarathnam died and others. ...Jdrs

1] T.Santosh Kumar Slo. Late T. Venkatarathnam, 5th J.dr.

2] T. Rupa, D/o. T. Venkatarathnam, aged about years, Hindu 6th Jdr:

3] T. Deepa, D/o. T. Venkatarathnam, aged about years, Hindu, 7th Jdr:

4]T. Silpa, D/o. T. Venkatarathnam, aged about years, Hindu, 8th Jdr:

5] T. Suda, D/o. T. Venkatarathnam, aged about years, Hindu, 8th Jdr:

The J.Drs. 5 to 9 are residing at D.No 7-24, Apparao Street, Madanapalle

NOTICE

Please take Notice that the above E.P. is posted to 07-10-2025 for your appearance. You may appear in person or through your Advocate on 07.10. 2025 at 10.30 AM before the Honourable Court, and if you fail to appear in person or through your Advocate failing which the E.P will be decided.

//By Order of the Court//

C. SANJAY KUMAR

Advocate,

MADANAPALLE

సెక్యూరిటీ గార్డ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి : సిఐటియు

మృతి చెందిన సెక్యూరిటీ గార్డ్ రవితేజ

ప్రజాశక్తి-పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని మంగంపేట ఎపిఎండిసి స్కూల్‌లో 12 సంవత్సరాలుగా సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న రవితేజ మృతి పట్ల ఎపిఎండిసి యాజమాన్యం రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామానుజులు డిమాండ్ చేశారు. స్కూల్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న రవితేజ స్కూలు యాజమాన్యం ఆదేశాలతో మోటార్ ఆన్ చేయడానికి శనివారం ఉదయం 11 గంటల ప్రాంతంలో వెళ్లి అనుమానాస్పదంగా మృతి చెందాడని తెలిపారు. విగతజీవిగా ఉన్న రవితేజను ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారని చెప్పారు. విధి నిర్వహణలో ఉన్న రవితేజ మృతి చెందినందున కుటుంబానికి స్కూల్ యాజమాన్యం రూ.25లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవితేజ సెక్యూరిటీ గార్డ్ పనే కాకుండా పాఠశాలలో అన్ని పనులు చేయించడంతో పని ఒత్తిడికి గురయ్యాడని తెలిపారు. పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉన్నారని కేవలం 24 మందిని నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించారని, అందులో రవితేజ ఒకడని చెప్పారు. ప్రస్తుతం 1000 మంది విద్యార్థులు సంఖ్య పెరిగినా యాజమాన్యం నాన్ టీచింగ్ సిబ్బందిని పెంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నవారిని విధుల నుంచి తొలగించి ఆ భారం మరో కార్మికులతో చేపించడం వల్లే రవితేజ మృతి చెందాడని ఆరోపించారు. మృతుడికి ఇల్లు, భూములు కల్పోయిన కార ణంగా పాఠశాలలో ఉద్యోగం ఇచ్చారని చెప్పారు. ఎపిఎండిసి యాజమాన్యం, ప్రిన్సిపల్ బాధ్యత వహి ంచి రవితేజ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. వారి కుటుంబంలో భార్యకు ఎపి ఎండి సిలో ఉద్యోగం కల్పించాలని పిల్లలను చదివించే బాధ్యత ఎపిఎండిసి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రవితేజ కుటుంబం చేసే న్యాయమైన పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతిస్తున్నట్లు ప్రకటించారు.

వైసిపి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులకు సన్మానం


దేశాయ్ తిప్పారెడ్డి, షమీమ్‌ను సన్మానిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైసిపి రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులుగా ఎంపికైన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎపిఎండిసి చైర్ పర్సన్ షమీమ్ అస్లాంను శనివారం వైసిపి ఘనంగా సన్మానించారు. పార్టీ ఆవిర్భావం విధేయులుగా అందిస్తున్న సేవలను గుర్తిస్తూ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించిందని మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ పేర్కొన్నారు. స్థానిక దేశాయ్ ఫంక్షన్ హాల్‌లో నిస్సార్ అహమ్మద్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమం, అభినందన సభకు డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి, షమీమ్ అస్లాం, మునిసిపల్ ఛైర్పర్సన్ మనుజారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి మాట్లాడుతూ తనకు వచ్చిన పదవి ఏదైనా బాధ్యతగానే భావిస్తానన్నారు. పార్టీ తనకు ఇచ్చిన ఈ బాధ్యతను ప్రజలకు, పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పదవులు వచ్చిన వారు, లేని వారు అనే తారతమ్యం ఉండదని, అందరం ఒక్కటిగా కలసి పనిచేద్దామన్నారు. పార్టీకి పూర్వవైభవం తెస్తూ, వైసిపి జెండాను ఎగురవేద్దామని పిలుపు నిచ్చారు. పార్టీ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేస్తూ అధికార పార్టీ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడదామన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, అదే స్ఫూర్తితో పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని, అందరం కలసి పనిచేద్దామని కోరారు. షమీమ్ అస్లాం మాట్లాడుతూ పార్టీలో అందరం రానున్న మూడేళ్లు అహర్నిశలు శ్రమిస్తూ, పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు ప్రజల పక్షాన నిలబడుదామని తెలిపారు. కార్యకర్తలకు ఎంపీ మిథున్‌రెడ్డి అండగా ఉంటారని, ఎవరు అధైర్య పడవద్దని భరోసానిచ్చారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అందరూ సమన్వయంతో పనిచేసి, పార్టీని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి, సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లికార్జున, నాయకులు చిప్పిలి మల్లికార్జున రెడ్డి, రమణా రెడ్డి, రామచంద్రారెడ్డి, వెలుగు చంద్ర, సాయి శేఖర్‌రెడ్డి, నరీబాబాయ్, నాగిరెడ్డి, 3వ వార్డు నూరుల్లా, కొత్తపల్లె మహేష్ బాబు, సర్పంచులు శరత్‌రెడ్డి, మహేష్, మహిళా నాయకులు శారదారెడ్డి, మేరీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

మాట్లాడుతున్న ప్రేరణసంస్థ రీజినల్ కో-ఆర్డినేటర్ స్వర్ణలత

ప్రజాశక్తి-గాలివీడు

బాలికలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రేరణ సంస్థ రీజినల్ కో-ఆర్డినేటర్ స్వర్ణలత పేర్కొన్నారు. శనివారం తూముకుంట గ్రామంలో సోలార్ వారి సహకారంతో ప్రేరణ సంస్థ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల అభివృద్ధి చెందడానికి వారి ఆరోగ్య సంరక్షణ వ్యక్తిగత సంరక్షణ జరగాలన్నారు. కిశోర బాలికలు వ్యక్తిగత ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యమన్నారు. బాలికల చట్టాలపై కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల్య వివాహాల చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలపై తల్లిదండ్రులకు అవగాహనకల్పించాలన్నారు. సోలార్ సంస్థ నుంచి శిరీష ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మమత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దీప్తి సూపర్‌వైజర్ సోని మహిళా పోలీస్ అనుపమ, పంచాయతీలోని వివిధ పల్లెలకు చెందిన 44మంది కిశోర బాలికలు, స్థానికులు పాల్గొన్నారు.

సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

పజాశక్తి - ఖాజీపేట

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రజా ప్రయోజన పనులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తామని పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ తెలిపారు. శనివారం గ్రామ సచివాలయ కార్యాలయంలో ఉపాధి హామీ పనులకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరం పనుల గుర్తింపుపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కాలవల అభివృద్ధి, పూడికతీత పనులు, రహదారికి ఇరువైపులా కంప చెట్ల తొలగింపు వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. కార్యక్ర మంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి శంకరమ్మ పాల్గొన్నారు.

ప్రజలకు ఉపయోగపడే పనులు చేపట్టాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు మండలం గంజికుంట, వనిపెంట సచివాలయాలలో శనివారం ఉపాధి గ్రామసభను ఏపీఓ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జయభారత్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు రైతులకు ఉప యోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోడ్ల వెంబడి కంపచెట్ల తొల గింపు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు పెంపకం వంటి పనులను చేయా లన్నారు. ఏపీఓ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ 2025- 26 ఆర్థిక సంవ త్సరానికి సంబంధించి పనులను గుర్తిస్తున్నామన్నారు. గ్రామసభల ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులను వారిని అడిగి తెలుసుకుం టున్నా మన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఉపాధి హామీ చట్టంలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరు ఫేస్ ఇకెవైసి తప్పనిసరిగా చేయిం చుకోవాలని ఏపీవో జయభారతి సూచించారు. శనివారం మం డలంలోని పలు గ్రామాలలో ఉపాధి పనులు గుర్తింపు, ఆమోదంపై గ్రామ సభలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇకెవైసి చేయించుకోకపోతే పని బుక్ తొలగిపోతుందన్నారు. ఆయా గ్రామ సచివాలయాల్లో మూడు రోజులపాటు ఇకెవైసి ఫొటో అప్డేట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జాబు కార్డు దారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఎఎన్ఎంలు జాగ్రత్తలు పాటించాలి

ఎర్రగుంట్ల : పిల్లలకు టీకాలు వేసేటప్పుడు ఎఎన్ఎంలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వర కుమార్ సూచించారు. అర్బన్ వైద్యశాలలో శనివారం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి బుధ, శనివారాల్లో పిల్లలకు టీకాలు తప్పనిసరిగా వేయాలని ఆదేశించారు. పొరపాట్లు దొర్లకొండా టీకాలు వేసే సమయంలో బాధ్యతగా వ్యవహ రించాలన్నారు. రికార్డులను కచ్చితంగా నిర్వహించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మునిరెడ్డి, స్థానిక వైద్యాధికారి శ్రీనాథ్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ ఓబులేసు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

టిడిపి కూటమి, వైసిపి దొందూదొందే

ప్రజాశక్తి - వేంపల్లె

మద్యం పాలసీ విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం, వైసిపి దొందూదొందేనని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేక రులతో మాట్లాడుతూ గతంలో వైసిపి, ప్రస్తుతం టిడిపి కూటమి ప్రభుత్వాలు వేరైనా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా చేశాయని విమర్శించారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్ట్ షాపులు అన్న విధంగా మద్యం పాలసీ తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిఘా నిర్లక్ష్యం కారణంగా నకిలీ మద్యం తయారీ కేంద్రాలు విచ్చలవిడి అయి నట్లు చెప్పారు. అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె నియో జకవర్గంలో ఉన్న మొలకలచెరువు మండల కేంద్రం వద్ద ఎక్సైజ్ అధికారులు నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడి చేసి రూ,1 కోటి 75 లక్షలు విలువచేసే నకిలీ మద్యం తయారు చేసే పరికరాలు, 9 మంది కూలీలతోపాటు నకిలీ మద్యం అమ్ముతున్న ఓ బ్రాందీ షాపు యజమానిని అరెస్టు చేశారన్నారు. మద్యం మత్తులో రాష్ట్రంలో అనేక అనర్థాలు చోటు చేసుకుంటున్నట్లు వివ రించారు. బెల్ట్ షాపులను పూర్తిగా అరికట్టాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ నిజమైన దేశ సేవ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రజాస్వామ్య పరిరక్షణ నిజమైన దేశ సేవ అని, ఓటు హక్కు దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని అని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ఇర్ఫాన్‌బాషా తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యలతో స్ఫూర్తి పొంది, పిసిసి ప్రెసిడెంట్ షర్మిల పిలుపుమేరకు శనివారం మండల పరిధిలోని గోపవరం పంచాయతీ భగత్‌సింగ్ కాలనీలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ఓటు చోరీలు దేశానికి ప్రమాదమన్నారు. రాజ్యాంగాన్ని రక్షించడం అంటే ప్రజల హక్కులను కాపాడటమేనని తెలిపారు. ఓటు దొంగ.. గద్దె దిగు అనే నినాదంతో ఇంటింటికి వెళ్లి ప్రజల్లో ఓటు చోరీలపై అవగాహన కల్పించారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించి ఎన్నికల వ్యవస్థలో అక్రమాలను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యాన్ని ప్రేరేపించారు. భగత్‌సింగ్ కాలనీలో పాల్గొన్న పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజలచే నీరాజనాలు అందుకున్నారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, డిసిసి కార్యదర్శి, నాయకులు మౌలాలి, సలందర్ గౌస్, చెన్నూర్ అబ్బాస్, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : సబ్ జైల్ దగ్గర ఉన్న మదరసా ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్‌లో విశ్వ కారుణ్య మూర్తి ప్రవక్త మొహమ్మద్ జీవిత చరిత్ర పై రాత పరీక్ష పోటీలో పాల్గొన్న విజేతలకు ఆదివారం బహుమతులు ప్రదానం చేయనున్నామని కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్ ఎం ముక్తార్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా మేయర్ ఎస్.ముంతాజ్ బేగంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారని పేర్కొన్నారు. బహుమతి ప్రదానంతో పాటు ఆధ్యాత్మిక సమావేశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు, ముస్లిం సోదరులు పాల్గొవాలని పేర్కొన్నారు.

నేడు ఆల్లూరి వెంకటయ్య స్మారక పురస్కార ప్రదానోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నాటకరంగ ప్రముఖులు, పలు నంది అవార్డుల గ్రహీత, సవేరా ఆర్ట్స్ వ్యవస్థాపకులు ఆల్లూరి వెంకటయ్య స్మారక పురస్కార ప్రదానోత్సవం ఆదివారం సాయంత్రం 5 గంటలకు కడప నేక్ నామ్ ఖాన్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు ఇంటాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాటక రంగం విభాగంలో ప్రముఖ సినీ రంగస్థల నటి డాక్టర్ జి.రత్నశ్రీ, లలిత కళల విభాగంలో యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళల విభాగం అధిపతి డాక్టర్ కోట మృత్యుంజయ రావుకు ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి నృత్య పోటీలు అనంతరం, శ్రీరామ పాదుకలు నాటకం, డాక్టర్ జి.రత్నశ్రీ చే చింతామణి రంగస్థల పద్యాలాపన ఉంటుందని తెలిపారు.

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి- కడప అర్బన్

మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం జిఎస్‌టి విధానంలో కొత్తగా తెచ్చిన మార్పుల గురించి లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్‌రెడ్డి రిలయన్స్ స్మార్ట్ బజార్‌లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏ వస్తువు మీద కొత్త విధానంలో ఎంఆర్‌పిలో ఎంత మార్పు వచ్చింది, దాన్ని ఏ విధంగా లెక్కించాలి వంటి వంశాలపై జిఎస్‌టి క్యాలిక్యులేటర్ ద్వారా వివరించారు. జిఎస్‌టి ఫలితాలు ప్రజలకు చేరుతున్నాయో లేదో బిల్స్ చూసి సరిగా వస్తున్నాయో లేదో పరిశీలించారు. జిఎస్‌టి ఫలితాలు విని చివరి వినియోగ దారానికి చేరకపోతే తగిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్ర మంలో రిలయన్స్ స్మార్ట్ బజార్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.

ఇంటిలో ఎగసి పడుతున్న మంటలు

చింతలకుంటలో అగ్ని ప్రమాదం

- రూ.10 లక్షలు నష్టం

ప్రజాశక్తి - నందలూరు

చింతలకుంట గ్రామం హరిజనవాడలో బల్లి ఓబులేసు అనే దళితుడి ఇల్లు శనివారం ఉదయం అగ్ని ప్రమాదానికి గురి అయ్యి దాదాపు 10 లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించింది. బాధితురాలు మహా లక్ష్మమ్మ కథనం మేరక.. ఉదయం 10 గంటల సమయంలో ఇంటిలోని ఫ్రిజ్‌లో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాప్తి చెందాయని తెలిపారు. ఈ సంఘటనలో రెండున్నర లక్ష రూపాయలు, బంగారు, ఇంటిలోని పలు రకాల వస్తువులు గుడ్డలు ఆహుతయాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు పది లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని బాధితురాలు బోరున విలపించింది. ఈ సమాచారం అందుకున్న రాజంపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపులోనికి తెచ్చారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధితురాలు కోరింది.

వైద్యులు అందుబాటులో లేక రోగులకు అవస్థలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండల పరిధిలోని వనిపెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది అందుబాటులో లేక వైద్యం కోసం వచ్చిన రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్య సిబ్బంది సమ్మె చేపడుతున్నారు. దీనితో కొంత మందిని వైద్యం కోసం ఇన్చార్జిలుగా నియమించారు. వీరు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తుండడంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైద్యం కోసం వెళ్లిన రోగులకు ఓపి కాగితం మాత్రం తప్పకుండా సిబ్బంది ఇస్తున్నారు. ఓపి పొందిన తర్వాత గంటల తరబడి వేచి చూసి రోగులు ఓపిక లేక వెనుతిరిగి వెళుతున్నారు. ఓపి పుస్తకంలో మాత్రం పేర్లు నమోదు చేసుకొని సిబ్బంది వారు తమ పనిని సులభంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు స్పందించి రోగులకు వైద్య సేవలు అంది ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

రవాణాశాఖ అధికారుల నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

జిల్లాలో దసరా పండుగ సీజన్‌లో ప్రజల వద్ద నుండి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సుల యజమానులపై చర్యలు తీసు కోవడంలో రవాణా శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డివై ఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ, అధ్యక్ష కార్యదర్శులు మేరీ కుమార్, విశ్వనాథ్ విమర్శించారు. శనివారం ప్రొద్దుటూరు కార్యాల యంలో విలేకర్లతో వారు మాట్లాడుతూ పండుగ సీజన్‌లో విచ్చలవిడిగా బస్సు టికెట్లను అధిక మొ త్తంలో ప్రజల వద్ద నుండి వసూలు చేస్తున్నారన్నారు. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని డిమాండ్‌ను పట్టి బస్సు టికెట్లను పెంచుకుంటూ పోతు న్నారని తెలిపారు. దీనిపై జిల్లాలో రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ఎందుకు చర్యలు తీసుకో వడం లేదని వారు ప్రశ్నించారు. డివైఎఫ్ఐ అధ్వర్యంలో రవాణా శాఖ అధి కారులకు వినతిపత్రాలిచ్చినా స్పందన లేదన్నారు. బహిరంగంగా ఆన్‌లన్‌లో ఛార్జీలు రూ.2000, ఆ పైన రేట్లు చూపిస్తున్నా చర్యలు శూన్యమన్నారు. హైదరాబాద్, చెన్నయ్, బెంగళూరు, విజయవాడ, విశాఖపట్నంకు ప్రయివేట్ బస్సు సర్వీసులు నడుస్తున్నాయని తెలిపారు. ఇద్దరు డ్రైవర్లు ఉండాలని కానీ ఒక్క డ్రైవర్‌ను రూటు సర్వీసులకు తిప్పుతూ డ్రైవర్లపైన ఒత్తిడి చేస్తు న్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు నిర్వహించి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐగా డిమాండ్ చేస్తున్నామన్నారు. **జమ్మలమడుగు :** దసరా పండుగ సీజన్‌లో ప్రజల వద్ద నుండి అధిక మొ త్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులపై రవాణా శాఖ అధికారుల నిర్లక్ష్యమేల అని డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్ట ణ ఉపాధ్యక్షులు సుభహన్ పేర్కొన్నారు. పండుగ సీజన్లో విచ్చలవిడిగా బస్సు టికెట్లను అధిక మొత్తంలో ప్రజల వద్ద నుండి వసూలు చేసున్నారన్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని డిమాండ్‌ను బట్టి బస్సు టికెట్లను పెంచుకుంటూ పోతున్నా రవాణా శాఖ అధికారులు తని ఖీలు నిర్వహించి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు.

దొంగ ఓట్లపై సంతకాల సేకరణ

ప్రజాశక్తి - చాపాడు

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓట్ చోర్ గద్దీ చోడ్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి చాపాటి రామసుధాకర్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నియోజకవర్గంలో కార్యక్రమంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం విలువలకు తిలోదకాలిస్తూ ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ ప్రజల ఓట్లను దోచుకోని గద్దెనెక్కిందన్నారు. దేశ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఎన్నికల సంఘంలో జరుగుతున్న ఓట్ల చోరీ అంశాన్ని పకడ్బందీ సాక్ష్యాదారాలతో దేశ ప్రజల ముందు ఉంచారన్నారు. ముఖ్యంగా యువత మేధావి వర్గం దీనిపైన దృష్టి పెట్టి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు పవిత్రతను కాపాడాలన్నారు.

క్రైం కార్నర్

హార్సిలీహిల్స్ ఘాట్‌లో దారి దోపిడీ

- యువకుడిని బెదరించి నగదు స్వాహా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ ఘాట్‌లో శనివారం వేకువ జామున దారి దోపిడీ జరిగింది. బి.కొత్తకోట పోలీసుల కథనం మేరకు.. బెంగళూరుకు చెందిన యువకుడు అజయ్ ద్విచక్ర వాహనంలో హార్సిలీహిల్స్‌కు బయల్దేరాడు. ఘాట్ సెక్షన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించారు. అజయ్‌ని కొట్టి అతనివద్ద ఉన్న కొంత నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. స్థానికుల సాయంతో బాధితుడు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని చికిత్స చేయించుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిఐ గోపాల్ రెడ్డి విచారిస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధురాలికి గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బైక్ ఢీకొని వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం రామసముద్రం మండలంలో జరిగింది. రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని పెద్ద కురప్పల్లికి చెందిన గుర్రమ్మ ఇంటి ముందు నిల్చొని ఉండగా అటుగా వచ్చిన గుర్తుతెలియని ద్విచక్ర వాహన దారుడు ఢీకొట్టి వెళ్లిపోయాడని తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాధితురాలిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. రామసముద్రం పోలీసులు విచారిస్తున్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఉద్యోగానికి వెళ్లమన్నందుకు యువతి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు..మండలంలోని కొత్తపల్లి పంచాయతీ, బండకింద పల్లెకు చెందిన లిఖిత బెంగళూరులో ఉద్యోగం చేస్తూ ఇంటికి వచ్చింది.ఉద్యోగానికి వెళ్లకుండా ఇంటివద్దనే ఉండిపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. బెంగుళూరుకు వెళ్లి బుద్ధిగా ఉద్యోగం చేసుకోవాలని గట్టిగా చెప్పారు. ఆ యువతి మనస్తాపం చెంది, ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహ త్యాయత్నానికి పాల్పడింది. గమ నించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథ మ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు విచారిస్తున్నారు.